క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన

వరికుంటపాడు : వేంపాడు ఎస్సీ కాలనీలో 104 వాహన సేవలను శుక్రవారం అందజేశారు. డాక్టర్ కరీష్మా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం 50 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

చేజర్ల: మండలంలోని వావిలేరు, మాముడూరు గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదును ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. పార్టీ మండలాధ్యక్షుడు గుండాల విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు బత్తల కృష్ణయ్య, కుంకు బాలయ్య, అలపాటి నారాయణరెడ్డి, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివాస్



సోమశిల: అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సురేష్ ఆధ్వర్యంలో ముందస్తుగా హిందీ దివాస్‌ను శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హిందీ అక్షరాలు అ, ఆ నమూనాలో విద్యార్థులు కూర్చుని ఆకట్టుకున్నారు. హిందీ ఉపాధ్యాయులు మదీనా, చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో తహలీల్‌ఫాతేహా



అనుమసముద్రంపేట: స్థానిక హజరత్ ఖాజా నాయబ్‌రసూల్ దర్గాలో జరుగుతున్న దొరసానమ్మ గంధ మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. మూడ్రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు తహలీల్ ఫాతేహాను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆదేశాల మేరకు దర్గా ఈఓ షేక్ మహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చదివింపులు జరిపి భక్తులకు గంధం పంచిపెట్టారు.

‘విట్స్’లో విశ్వోత్సవ్ వేడుకలు



స్పోర్ట్స్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీఓ

కావలి: పట్టణంలోని విట్స్ కళాశాలలో విశ్వోత్సవ్ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాశాల సిల్వర్ జూబ్లీని పూర్తి చేసుకున్న సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా తొలిరోజు స్పోర్ట్స్ ఫెస్ట్ జరిపారు. కావలి ఆర్డీఓ శీనానాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కళాశాల రెక్టార్ వినయ్‌కుమార్‌రెడ్డి, చైర్మన్ విద్యాధర్‌రెడ్డి, డైరెక్టర్ ప్రత్యూషారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

సోమశిల: అనంతసాగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. అధిక లోడుతో వెళ్తున్న మూడు ఆటోలు, అతివేగంతో వెళ్తున్న ఓ మోటార్‌సైకిల్‌ను పట్టుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆయన వెంట ఏఎస్సై మస్తాన్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కేజీబీవీలో తనిఖీలు

సీతారామపురం: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆత్మకూరు డిప్యూటీ ఈఓ గోపాల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 9,10 తరగతుల విద్యార్థినులతో సమావేశమై విద్యా పురోగతిపై ఆరా తీశారు. పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంఈఓ మస్తాన్‌వలి ఉన్నారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆత్మకూరు ఎస్సై–2గా కే శ్రీనివాసులురెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఆత్మకూరు, మర్రిపాడు మండలాల్లో ఏఎస్సైగా విధులు నిర్వహించారు. నూతన ఎస్సైకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నేడు యథావిధిగా పాఠశాలలు

ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను శనివారం యథావిధిగా పనిచేస్తాయని ఎంఈఓ తోట శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఇటీవల తుపాను కారణంగా పాఠశాలలకు సెలవు ఇచ్చారని, అందుకు బదులుగా రెండో శనివారాన్ని పనిదినంగా ప్రకటిస్తూ డీఈఓ ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈ మేరకు అన్ని పాఠశాలలను యథావిధిగా నిర్వహించాలని హెచ్‌ఎంలకు సూచించారు.

జగనన్న కాలనీలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

- ముందుకు సాగని నిర్మాణాలు
- ఆందోళనలో లబ్ధిదారులు

అందని బిల్లులు.. అసంపూర్తిగా నిర్మాణాలు



ఇళ్ల మధ్యన పెరిగిన కంపచెట్లు



ఆత్మకూరులో అసంపూర్తిగా గృహ నిర్మాణాలు

ఆత్మకూరు: పేదల ఇళ్లపై నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. పేదల సొంతింటి కలను సాకారం చేయాలని భావించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో సొంతిళ్లు లేని వారికి నివేశన స్థలాలను కేటాయించింది. గృహ నిర్మాణాలను మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకే ఆప్షన్లు ఇచ్చింది. సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని పలువురు లబ్ధిదారులు సచివాలయ సిబ్బంది చెప్పినట్లుగా కాంట్రాక్టర్ల ద్వారా ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టారు. దీంతో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగాయి. ఎన్నికల కోడ్ రావడంతో బిల్లులు ఆగడంతో పనులు నిలిచిపోయాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బిల్లులు మంజూరుకు చర్యలు తీసుకోకపోవడంతో లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

7,833 గృహాలు మంజూరు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆత్మకూరు నియోజకవర్గంలో 7,833 ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 1302 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లుగా అధికారిక సమాచారం. మిగిలిన గృహాలు వివిధ స్థాయిల్లో ఉన్నాయి. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం, పమిడిపాడులోని జగనన్న కాలనీ లేఅవుట్లలో సుమారు 2,279 ఇళ్లను మంజూరు చేశారు. అందులో 965 ఇళ్లు పూరయ్యాయి. మిగిలిన గృహాలు వివిధ స్థాయిలో ఉన్నాయి. అందులో అధిక శాతం బేస్‌మెంట్ స్థాయిని దాటలేదు. పూర్తయిన గృహాలకు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని పూర్తిస్థాయిలో అందించారు. ఎన్నికల కోడ్ రావడంతో బిల్లులు నిలిచిపోయి మిగిలిన గృహాలు అసంపూర్తిగా మిగిలాయి. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరుకు చర్యలు తీసుకోకపోవడంతో నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వంద రోజుల ప్రణాళిక ద్వారా 1.25 లక్షల గృహాలను పూర్తి చేస్తామని వెల్లడించారు. అయితే వారు చెప్పిన దాంట్లో సగం రోజులు ముగిసినా ఇంత వరకు నిర్మాణాల్లో పురోగతి లేదు. రాష్ట్రంలో నెల్లూరు జిల్లాకు మాత్రమే బిల్లులు మంజూరు కాలేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో తమ సొంతింటి కల సాకారమయ్యేనా అంటూ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేం

గృహ నిర్మాణాలు పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు చేద్దామనుకునే వారికి విద్యుత్ శాఖ అధికారుల మాటలు షాక్‌కు గురి చేస్తున్నాయి. గతంలో నాలుగు గోడలు నిర్మించిన ఇళ్లకు విద్యుత్ మీటర్లు ఇచ్చిన అధికారులు ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నాం, విద్యుత్‌మీటర్లు ఇవ్వాలని తిరుగుతున్నా ఇవ్వలేమని చెబుతున్నారు. అంతేగాకుండా లేఅవుట్లలో వీధి దీపాలు సైతం లేకపోవడంతో అంధకారం నెలకొంది.

అధికారులు చెప్పినా..

కలెక్టర్ ఆనంద్ ప్రతి సోమవారం నిర్వహించే రివ్యూ సమావేశంలో సైతం స్టేజ్ కన్వర్షన్‌పై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని పదే పదే సూచనలు చేశారు. సచివాలయ ఉద్యోగులు ప్రతి లబ్ధిదారుడి ఇంటి వద్దకు వెళ్లి వారిని కలిసినా గృహ నిర్మాణాల వైపు వారు ఆసక్తి చూపడం లేదు. అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నా అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించకపోతే సమస్యలతో సహవాసం ఎవరు చేస్తారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

ఉపాధి హామీకి నోచుకోని మున్సిపల్ లేఅవుట్లు

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు, మౌళిక సదుపాయాల కల్పనకు ఉపాధి హామీ పథకం కూలీలను వినియోగించుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. అయితే మున్సిపల్ పరిధిలో ఉపాధిహామీ పథకం లేనందు వల్ల లేఅవుట్లలో పారిశుధ్య పనులు చేపట్టడం సాధ్యపడడం లేదు. దీంతో లేఅవుట్లు చిట్టడవిని తలపిస్తున్నాయి. దీంతో కాలనీల్లో అరకొర వసతుల నడుమ జీవనం సాగిస్తున్న వారు సైతం ఖాళీ చేసి వెళ్లిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

మౌలిక వసతులు కరువు

జగనన్న కాలనీల్లో సొంతంగా గృహాలు నిర్మించుకునేందుకు ముందుకొచ్చిన లబ్ధిదారులను సమస్యలు వెంటాడుతున్నాయి. ఎన్నికలకు ముందు నుంచి గృహ నిర్మాణాలు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తోంది. మొత్తంగా ఐదు నెలలుగా నిర్మాణ పనులు సాగకపోవడంతో అసంపూర్తిగా నిర్మించిన గృహాల గోడలు బీటలు వారుతున్నాయి. గతంలో లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన నీటి కోసం ఏర్పాటు చేసిన ట్యాంకులు మాయమయ్యాయి. పమిడిపాడు లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన మోటార్ సైతం మరమ్మతులకు గురైంది. పైప్ లైన్లు, కుళాయిలు సైతం దాదాపుగా కనిపించని పరిస్థితి నెలకొంది.అంతర్గత రహదారులు సైతం ఛిద్రం కావడం, బేస్‌మెంట్ల వద్ద పిచ్చి చెట్లు భారీగా పెరిగిపోయాయి. దీంతో సొంతంగా నిర్మించుకునేందుకు ముందుకువచ్చిన లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పమిడిపాడు లేఅవుట్‌లో మరమ్మతులకు గురైన మోటార్

నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు గత కొన్ని నెలలుగా నిలిచిపోయిన విషయం వాస్తవం. ఇటీవల డివిజన్ పరిధిలో విజిలెన్స్ అధికారులు గృహ నిర్మాణాలను తనిఖీ చేసి నివేదిక సమర్పించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు తదుపరి గృహ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తాం. సొంతంగా ఇళ్లు నిర్మించుకునే వాళ్లు ఉంటే సంప్రదించవచ్చు.

–ముక్తియార్‌బాషా, డీఈఈ, గృహనిర్మాణ శాఖ

నిబంధనలకు విరుద్ధంగా చేపల వేట



చెరువులోని చేపలను పడుతున్న దృశ్యం

చేజర్ల: మండలంలోని మాముడూరు చెరువులో చేపలు పట్టేందుకు జూన్ 30వ తేదీతో గడువు ముగిసింది. అయితే గతంలో వేలం పాట పాడిన వ్యక్తి శుక్రవారం చేపలను పట్టడం వివాదాస్పదమైంది. ఈనెల 10వ తేదీన కొత్తగా వేలం పాట నిర్వహిస్తామని పంచాయతీ సెక్రటరీ పేరుతో పత్రికల్లో ప్రకటన వచ్చింది. అయితే ఆరోజు ఆ కార్యక్రమం జరగలేదు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 40 మంది వరకు పాటదారులు వెనుదిరిగారు. అధికార పార్టీ నాయకుల ప్రమేయంతో ఈ ప్రక్రియ ఆగిందని ప్రచారం ఉంది. కానీ సెక్రటరీ తనకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో వేలం పాట నిర్వహించలేదని చెబుతున్నారు. గడువున్న సమయంలో చేపలు పట్టుకోకుండా ఇప్పుడు ప్రారంభించడంపై గ్రామస్తులు అభ్యంతరం చెబుతున్నారు. దీనిపై అధికారులు స్పందిస్తూ చెరువు దగ్గరికి వెళ్లామని, చేపలు పట్టడం ఆపేశారన్నారు.

మట్టి తరలిస్తున్న వాహనాల స్వాధీనం

దుత్తలూరు: మండలంలోని ఏరుకొల్లు సమీపంలోని ప్రభుత్వ భూముల్లో నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను ఎస్సై ఆదిలక్ష్మి శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామ రెవెన్యూ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మట్టి అక్రమంగా తరలిస్తున్న జేసీబీ, మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూ.15.60 కోట్లతో ఉపాధి పనులు



ప్రజావేదికను నిర్వహిస్తున్న అధికారులు

కొండాపురం: మండలంలోని 19 పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.15.60కోట్లతో ఉపాధి పనులు చేపట్టినట్లు ఏపీడీ గాయత్రిదేవి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజావేదికను శుక్రవారం నిర్వహించారు. మండలంలోని 19 పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి పనులను తనిఖీ చేసి గుర్తించిన అవకతవకలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు చదివి వినిపించారు. ఏపీడీ గ్రాయత్రిదేవి, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి పంచాయతీల వారీగా అవకతవకలపై విచారణ చేపట్టారు. శుక్రవారం రాత్రి వరకు ప్రజావేదిక కొనసాగింది. రికవరీ వివరాలను శనివారం వెల్లడించనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా సాయిపేటకు చెందిన కొందరు గ్రామస్తులు ఆడిట్ సిబ్బంది సక్రమంగా విచారణ చేపట్టలేదని ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సార్పీ నీలకంఠం, గ్రామస్తుల నడుమ వాగ్వా దం చోటు చేసుకుంది. అలాగే సత్యవోలు పంచాయతీలో 270 జాబ్‌కార్డులకు పనులు కల్పించలేదని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. క్వాలిటీ కంట్రోల్ అధికారి వేణుగోపాల్, అంబుడ్స్‌మెన్ అధికారి వెంకటరెడ్డి, ఎంపీడీఓ బ్రహ్మయ్య, ఏపీఓ చెంచయ్య, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ పరీక్షలను బాధ్యతగా నిర్వహించాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

ఆత్మకూరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్షయ నిర్ధారణ పరీక్షలను బాధ్యతగా నిర్వహించాలని జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌వలి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని క్షయ పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది పరీక్షలు నిర్వహించే విధానాన్ని పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, డాక్టర్ ఉషాసుందరితో కలిసి వైద్యులతో సమీక్ష నిర్వహించారు. వైద్యులు రామనాథరెడ్డి, బాలాజీ, ల్యాబ్ అసిస్టెంట్ సుధాకర్, కే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు

సంగం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏడీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులరెడ్డితో కలిసి ఫార్మసీ విభాగాన్ని పరిశీలించి ఫార్మసీ అధికారి ప్రదీప్‌కుమార్‌ను అడిగి వ్యాక్సిన్, మందుల నిల్వల వివరాలను తెలుసుకున్నారు. మండలంలో క్షయ రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ నెల 17న జరిగే డీ వార్మింగ్ కార్యక్రమానికి సంబంధించి అల్బెండాజోల్ మాత్రలను అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక వైద్యాధికారి డీ అశోక్, వైద్యసిబ్బంది ఉన్నారు.

ఆస్తి కోసమే హత్య చేశారా?

- బంగారం వ్యాపారి కుమారుడి మృతిపై సందేహాలు

కావలి: పట్టణంలో బంగారం వ్యాపారం చేసే మద్దసాని ప్రకాశం కుమారుడు యశ్వంత్ (25)ను ఆయన అల్లుడే ఆస్తి కోసం హైదరాబాద్‌లో హత్య చేసినట్లుగా అనుమానిస్తున్నారు. ఈ విషయం కావలిలోని వ్యాపార వర్గాల్లో శుక్రవారం చర్చ జరిగింది. మద్దసాని ప్రకాశం కుమార్తెను వివాహం చేసుకున్న వ్యక్తి అప్పుల పాలయ్యాడని, మామ వద్ద ఉన్న ఆస్తి మొత్తం తనకు దక్కాలంటే బావమరిది అయిన ప్రకాశం కొడుకును హత్య చేయాలని నిందితుడు తలచినట్లుగా చెబుతున్నారు. ఈ క్రమంలో మహారాష్ట్రలో ఉద్యోగం చేస్తున్న ప్రకాశం కుమారుడు హైదరాబాద్‌కు రాగా, అల్లుడు పది రోజుల క్రితం హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు అక్కడి పోలీసులు తెలియజేసినట్లు సమాచారం. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ప్రకాశం అల్లుడు నడుపుతున్న హాస్టల్లోనే హత్య జరిగినట్లు, సీసీ కెమెరాల ఫుటేజీ, మృతుని ఒంటిపై గాయాలను బట్టి హత్యగా పోలీసులు గుర్తించారని చెబుతున్నారు. కాగా ప్రకాశం గత నాలుగు రోజులుగా ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

ఏచూరి మృతి తీరని లోటు



ఆత్మకూరులో ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



ఉదయగిరిలో..

ఉదయగిరి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో శుక్రవారం ఏచూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమస్యలపై పోరాటాలు చేసి దేశ నాయకుడిగా ఎదిగారన్నారు. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేసి ప్రజల పక్షాన నిలబడి వారి మధ్యే తుదిశ్వాస విడిచిన గొప్ప నేత ఏచూరి అని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీపీఎం, సీఐటీయూ నాయకులు ఫర్దిన్‌బాషా, తిరుపతయ్య, షేక్.నాయబ్, గడ్డం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి సంతాప సభను పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. పార్టీ పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు నాగయ్య, నాగేంద్ర, నందానీ, శివప్రసాద్, లక్కు ప్రసాద్, సాదిక్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ మెగా లోక్‌అదాలత్

కావలి: ఈ నెల 14న కావలి కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తుల ఆధ్వర్యంలో జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నట్లు లోక్‌అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని, నగదును వృథా చేసుకోకుండా కక్షిదారులు రాజీపడి వస్తే లోక్‌అదాలత్‌లో సత్వర న్యాయం అందించడం జరుగుతుందన్నారు. లోక్‌అదాలత్ తీర్పులపై పైకోర్టులను ఆశ్రయించేందుకు అవకాశం ఉండదన్నారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వెంకటసుబ్బయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్వహణతో పాటు ఆర్డీఎస్ పనులు చేపడుతున్న కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని 11 కేవీ ఫీడర్స్ పరిధిలో సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

1045 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 1045 పొగాకు బేళ్లు విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలానికి 1382 బేళ్లు రాగా 337 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.358, కనిష్టంగా రూ.150, సగటున రూ.186.55 ధర పలికిందని వివరించారు.

రంగవల్లుల పోటీలు

చేజర్ల: వినాయక చవితి వేడుకల్లో భాగంగా చేజర్లలోని అరుంధతీయవాడలో మహిళలకు రంగవల్లుల పోటీలను శుక్రవారం నిర్వహించారు.విజేతలకు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు ఆత్మకూరు వీరాస్వామి, ఏ పోలయ్య, ఏ దొరబాబు, చినబాబు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛతయే సేవ



ఆత్మకూరురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛతయే సేవా కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని కోరారు. ఈఓపీఆర్డీ ఉషారాణి పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన

సీతారామపురం: స్థానిక ఎస్సీ కాలనీలోని బిట్–2 సచివాలయం వద్ద ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కెనరా బ్యాంకు మేనేజర్ జస్వంత్ కేంద్ర బీమా, సుకన్య సమృద్ధియోజన, ఏంజెల్ అకౌంట్, తదితర పథకాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు సిబ్బంది శ్రీకాత్, రత్నం పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి: వర్షకాలంలో విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రజలు తగిన జాగ్రత్తలను పాటించాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సూచించారు. వర్షకాలంలో సంభవించే విద్యుత్ ప్రమాదాలు–వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యుత్‌శాఖ రూపొందించిన వాల్‌పోస్టర్లను కావలి డీఈ, ఏఈలతో కలిసి ఆయన తన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈ, ఏఈ మాట్లాడుతూ మోటారు స్విచ్‌ను తడి చేతులతో, చెప్పులు లేకుండా వేయకూడదని తెలిపారు. పొలాల్లో తెగిపడిన వైర్లను తాకరాదని, పొలాల చుట్టూ వేసే కంచెకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకూడదని చెప్పారు. చేపలు, రొయ్యల చెరువుల వద్ద మోటార్ల వైర్లను నేలపైన వేయరాదని, జంతువుల వేటకు వేసే ఉచ్చులకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వరాదన్నారు. పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజ్‌లను రైతులు సొంతంగా వేసుకోకూడదని తెలిపారు. విద్యుత్ తీగలకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలను కొట్టరాదని, విద్యుత్ తీగల కింద లోడ్ వాహనాలను నడిపేటప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇళ్లపై ఆడుకునే పిల్లలు విద్యుత్ తీగల పట్ల జాగ్రత్తగా ఉండాలని, హీటర్ వాడేటప్పుడు స్విచ్ఛాఫ్ చేయకుండా నీటిని తాకరాదని, వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలను, వైర్లను తాకరాదని సూచించారు. ఐఎస్ఐ మార్క్ ఉన్న విద్యుత్ ఉపకరణాలు ఉపయోగించాలని తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలని సూచించారు.

25లోగా ఈకేవైసీ చేయించుకోవాలి



దుత్తలూరు: మహాజన సభ నిర్వహిస్తున్న దృశ్యం

దుత్తలూరు: కమ్మవారిపాళెం సొసైటీలో సభ్యత్వం కలిగిన రైతులందరూ ఈ నెల 25వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి పీ శ్రీనివాసులురెడ్డి కోరారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో మహాజన సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీని కంప్యూటరీకరణ చేస్తున్న నేపథ్యంలో సభ్యులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. సొసైటీలో సభ్యులుగా ఉండి చనిపోయిన, పొలం లేని వారిని గుర్తించి తొలగించాలని తీర్మానించారు. అనంతరం సొసైటీ జమ, ఖర్చులను పరిశీలించి ఆమోదించారు. సొసైటీ షేర్ ధనాన్ని రూ.2 కోట్లకు పెంచుతూ బైలా తయారు చేయాలని తీర్మానించారు. సొసైటీ సీఈఓ సీహెచ్ లోకనాథ్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

వరికుంటపాడు: రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని వరికుంటపాడు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి ఆర్ మల్లికార్జునరావు అన్నారు. వరికుంటపాడు సొసైటీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మహాజనసభలో ఆయన మాట్లాడారు. రైతులకు మార్ట్‌గేజ్, పంట రుణాలను రిజిస్ట్రేషన్ విలువను బట్టి కొత్త రుణాలను మంజూరు చేస్తున్నామని తెలిపారు. సొసైటీ సభ్యులు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. సొసైటీ సీఈఓ రత్తయ్య, సిబ్బంది మాల్యాద్రి, హజరత్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులతో చిన్నారుల్లో రక్తహీనత



కలిగిరిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్

ఆత్మకూరు: నులిపురుగులతో చిన్నారుల్లో రక్తహీనత తలెత్తుతుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి తెలిపారు. పట్టణంలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌లో ఈ నెల 17న నిర్వహించనున్న డీ వార్మింగ్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది నుంచి 19 ఏళ్లలోపు చిన్నారులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండాజోల్ మాత్రలను అందజేయాలని సూచించారు. అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యురాలు డాక్టర్ ఎస్‌కే అస్మా, సిబ్బంది ఎస్ సుధాకర్, ప్రణతిప్రియ, శ్యామ్, ఖాజారహ్మత్, ల్యాబ్ సుధాకర్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి: స్థానిక పీహెచ్‌సీలో డీవార్మింగ్ డేకు సంబంధించిన వాల్‌పోస్టర్లను వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. సీహెచ్‌ఓ సాయిలక్ష్మి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే



మర్రిపాడు: మండలంలోని నందవరం ఆదర్శ పాఠశాలలో ఫ్రెషర్స్ డే, హిందీ దివాస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు కవితలు, పాటలు, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు నెహ్రూ యువకేంద్రం అధికారి మహేంద్రర్‌రెడ్డి బహుమతులను అందజేశారు. గతేడాది ఇంటర్, పదో తరగతిలో ప్రతిభకనబర్చిన, ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

ఆదర్శ పాఠశాలలో త్రీమెన్ కమిటీ విచారణ



సీతారామపురం: స్థానిక ఆదర్శ పాఠశాలలో త్రీమెన్ కమిటీ సభ్యులైన నెల్లూరు, ఆత్మకూరు డిప్యూటీ ఈఓలు లక్ష్మీప్రసన్న, గోపాల్, ఉదయగిరి సీడీపీఓ లావణ్య శుక్రవారం విచారణ చేపట్టారు. గతంలో పలు ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన ఫిజికల్ డైరెక్టర్ వ్యవహారంపై ప్రిన్సిపల్‌తో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను విడివిడిగా విచారించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ సమగ్ర నివేదికను డీఈఓ ద్వారా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు తెలిపారు. వారి వెంట ఎంఈఓ మస్తాన్‌వలి ఉన్నారు.